"తవకి పిల్ల లెంతమంది బాబూ?"

"ఆరుగుర్రా నాయనా" అని హీనంగా అన్నాడు.

'అందుకే పరుపు మీద సుకం నేదంటున్నారు."

'అవున్రా బాబూ - యిప్పుడు నువ్వు రూపాయిన్నర అడిగావు గదా, నీకు రూపాయిన్నర యివ్వాలనే బెంగతో యీరిక్షామీద కూర్చున్నా సుఖం లేదురా!"

"పోనీ ఉట్టినే దింపేత్తే, తవరికి బెంగ తీరిపోద్దా బాబూ?"

'అబ్బేబ్బే! నీ కష్టం మాకెందుకురా - నువ్వు న్యాయంగా అడ గాలి, నా పరుపూ దిండ్లూ నా వాలకం చూసి వీడు అడిగినంతా యిస్తాడు కదా అని నన్ను నువ్వు యిరకాటంలో పెట్టి డబ్బు గుంజెయ్యటం పాపంరా అబ్బీ!'

'నేయమేటి అన్నేయమేటి, బాబూ! మాపు అడక్కపోతే తవరు పావలా బేడా యిత్తానంటారు. మనిసిని కూకోబెట్టి మనిసంతమనిసి లాగి నో పావలా పరకా రావాలనుకోటం పాపం అన్నేయమైతే, మరి షావు కార్ల నాభాలన్నీ ఆల్ల ఆడోల్ల మెళ్ళో బంగారాలన్నీ, ఆల్ల మేడలూ మిద్దెలూ అన్నీ పాపాలు అన్నేయాలూ కావా? ఏటంటారు బాబూ——"

'ఎవరు చేసుకున్న పుణ్యం వాళ్ళదిరా! దేవుడే వాళ్ళకవన్నీ యిచ్చేడు.'

'దేవుడు మాకేటిచ్చేడు బాబూ? ఎనక జల్మంలోన ఏవీపున్నేలు సేసుకు పుట్టనేదు, మా బతుకులు కొబ్బరితోట బతుకులైపోనాయి. ఇగ మరి యీ జల్మలో మాపు చేసుకునే పున్నేవేపాటి? డబ్బులుచ్చుకు రిచ్చాలు నాగిపాపవే సెత్తున్నావని తవరిప్పుడేగందా సెపతన్నారు. మరిమాకు ముందు జల్మంలో గూడా యీబతుకే రాసి పెట్టుంది కావాల'

అందుకే వారానికి ఒకటి రెండు సినిమాలు చూస్తాడు.

అదృష్టవశాత్తూ సినిమాల్లో ఆకాసేపూ ఎవరూ కళపేరు చెప్పి గుండెల్ను పిండటం లేదు, గుడ్లు పీకెయ్యటంలేదు. అభూతకల్పనలు. కృత్రిమపుటావేశాలు. దొంగప్రణయాలు, దోపిడీసిద్ధాంతాలు తెర కెక్కించి జీవితాన్ని మైమరపింపచేసి హాయికలిగించి మత్తెక్కిస్తున్నారు.

బ్రతుకును గూర్చిన భయాందోళనలు మనుష్యులను పట్టుకు పీడిస్తువున్నపుడు——

రేపెవరువచ్చిమన్ని ఉద్ధరిసారు?

రేపెలాగ గడుస్తుంది?

ఈపీడ ఎలాగ విరగడవుతుంది?

మళ్ళీ మనుష్యుల ముఖాలలో చిరునవ్వు ఎప్పుడు ఉదయిస్తుంది? ఈ ప్రశ్నార్థకాలకు జవాబు సాహిత్యం చెబుతుందా? కళలు చెబుతాయా?

* * *

'కాస్త భుజంమీద పిగిలిన రవికలు రెండిచ్చాను. వెలిసిపోయిన నైలాను చీర దానిమొహాన కొటాను. అడిగినపుడల్లా పావలాపరకా ఇస్తున్నాను రోజూ టీపోస్తున్నాను. దీనిమొహం ముండా–రోజువిడిచి రోజూ నాగాయే! ఏడిపించుకు తింటోంది. శనిలా మన కొంపపట్టుకు వదట్టు!'

ఏరోజు పనిమనిషిరాదో ఆరోజు సూర్యుడు ఉదయించినా ఉదయించనట్టే.

'అలాచూస్తూ నిల్చోకపోతే ఆ తేచిన పక్కలెత్తి మంచాలు ఎం

